క్లుప్తంగా

3 నుంచి శిక్షణ తరగతులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో ప్లంబర్ కోర్సులో నిరుద్యోగులకు రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ తరగతులకు ఆసక్తి ఉన్న వారంతా హాజరుకావాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, శిక్షణానంతరం ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7981308986ను సంప్రదించాలని కోరారు.

సీతంపేటలోనే ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీస్..!

సీతంపేట: గిరిజన సంక్షేమ కార్యాలయం ప్రస్తుతానికి సీతంపేటలోనే కొనసాగనుందని స్థానిక అధికారులకు కలెక్టరేట్ నుంచి సమాచారం వచ్చినట్లు తెలిసింది. ఈ కార్యాలయాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి తరలించనున్నారని ఇటీవల గుసగుసలు వినిపించాయి. ఈ నేపథ్యంలో గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇటీవల ఇన్‌చార్జ్ పీఓ వీవీ రమణకు వినతిపత్రాలు అందజేశారు.

ఘనంగా పరీక్షిత్‌రాజు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి బర్త్ డే విషెస్ తెలియజేస్తున్న ఎంపీపీ దీనమయ్య, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ఎంపీపీ చాంబర్‌లో వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దీనమయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసి కేక్ కట్ చేసి, పరీక్షిత్‌రాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ భగవంతుడు నిండు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పార్టీ నేతలు గోరిశెట్టి గిరిబాబు, బోగపురపు నాగు, వహీద్ ఖాన్, ఎద్దు మురళి, బోటు లక్ష్మీనారాయణ, గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట సర్పంచ్‌లు బి.గౌరీశంకరరావు, ఆర్.ఎస్.చైతన్య స్రవంతి తదితరులు పాల్గొన్నారు.


కూలిన పాఠశాల పైకప్పు



కిందపడిన పైకప్పు రేకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చింతమానుగూడ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు రేకులు కూలిపోయినట్లు ఉపాధ్యాయుడు కె.రాజారావు తెలిపారు. పిల్లలు ఎవరూ లేని సమయంలో జరగడంతో ప్రమాదం తప్పిందన్నారు. శనివారం యథావిధిగా పాఠశాలను తెరవగా పైకప్పు భాగాన పెద్ద దూలాలు(కర్రలు), సిమెంట్ రేకులు నేలకూలి ఉన్నాయన్నారు. 20 ఏళ్ల క్రితం భవనం నిర్మాణ సమయంలో వేసిన దూలాలు వర్షాలకు తడిసి పాడయ్యాయని, ఇప్పుడు అవి విరిగిపోవడంతో పైకప్పు రేకులు పడిపోయాయన్నారు. ఆఖరికి చేసేదేమీ లేక తరగతులు గ్రామంలోని ఓ ఇంట్లో నిర్వహించారు.

పశువుల లారీ సీజ్



లారీలో కిక్కిరిసి ఉన్న పశువులు

పాలకొండ: నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న లారీని శనివారం సీజ్ చేశామని ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లారీలో 69 ఆవులను ఎక్కించి తరలిస్తుండగా.. పాలకొండ రోడ్డులోపట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పశువులను ఎక్కడకు తరలిస్తున్నదీ, ఆరా తీస్తున్నామని చెప్పారు. ఇందుకు బాధ్యులైన ఎం. సాయిగోవింద, వి. గణేష్, వి. సుబ్రహ్మణ్యాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శనివారం ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం తదితర పూజల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పుట్టుదేవునివద్ద భక్తులు విశేష పూజలు చేసి, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

గాలివానొస్తే అంతే..

- పడిపోతున్న విద్యుత్ స్తంభాలు, తెగిపోతున్న తీగలు
- వీరఘట్టం మండలంలో అధ్వానంగా విద్యుత్ లైన్లు
- తరచూ బ్రేక్‌డౌన్ అవుతున్న పాలకొండ – వీరఘట్టం విద్యుత్ లైన్
- నాణ్యమైన విద్యుత్ సరఫరా అందక తరచూ పాడవుతున్న ఎలక్ట్రికల్ గృహోపకరణాలు
- బ్రేక్‌డౌన్ సమయంలో సమస్యను సకాలంలో గుర్తించలేకపోతున్న సిబ్బంది



ఈదురుగాలులు దాటికి పాలకొండ-వీరఘట్టం 33/11 కేవీ విద్యుత్ లైన్‌లో విరిగిన ఇనుప స్తంభం (ఫైల్)

వీరఘట్టం :

మండలంలో కొద్దిగా గాలేస్తే విద్యుత్ వినియోగదారులకు గుండె దడ పట్టుకుంటోంది.. అదే గాలీ,వాన రెండూ వస్తే పాలకొండ నుంచి వీరఘట్టానికి వచ్చే 33/11 కేవీ విద్యుత్ లైన్ బ్రేక్‌డౌన్ అవుతుంది. ఆ రోజు విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొంటుంది. సుమారు 40 ఏళ్ల కిందట పాలకొండ నుంచి వీరఘట్టానికి విద్యుత్ లైన్ వేశారు. అప్పటి పరిస్థితుల దృష్ట్యా పంట పొలాలు, చెరువుల గుండా ఈ విద్యుత్ లైన్ వేశారు. అప్పట్లో 9.1 మీటర్ల రెయిల్ పోల్స్ (ఇనుప స్తంభాలు) సుమారు 300 వరకు వేశారు. కాలక్రమేణా వచ్చిన ప్రకృతి వైపరిత్యాలకు కొన్ని విద్యుత్ స్తంభాలు నేలకొరగగా వాటి స్థానంలో 11 మీటర్ల కాంక్రీట్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఈ విద్యుత్ లైన్ వేసి సుమారు 40 ఏళ్లు అవుతుండడంతో గాలి, వర్షం వచ్చిన ప్రతిసారీ ఈలైన్‌లో ఎప్పటికప్పుడు విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, విద్యుత్ లైన్లు తెగిపడుతుండడంతో వీరఘట్టం మండల ప్రజలకు తరచూ విద్యుత్ కష్టాలు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి....

ఇటీవల ఆగస్టు 12వ తేదీన పాలకొండ-వీరఘట్టం విద్యుత్ లైన్ బ్రేక్‌డౌన్ అయ్యింది. సాయంత్రం 6 గంటల నుంచి లైన్‌మన్లు కష్టపడితే రాత్రి 9 గంటలకు సమస్య ఎక్కడ ఏర్పడినదీ తెలిసింది. వీరఘట్టం సమీపంలోని వెంకమ్మ చెరువు వద్ద విద్యుత్ తీగలు తెగిపడడంతో వాటిని సరి చేసేందుకు రాత్రి పదిన్నరైంది. అలాగే ఆగస్టు 18న రాత్రి 8 గంటల నుంచి 10 ఉరకు వీరఘట్టం మండల వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వర్షం దాటికి విద్యుత్ లైన్ బ్రేక్‌డౌన్ కావడంతో రాత్రి 1.30 గంటల సమయానికి విద్యుత్ పునరుద్ధరణ జరిగింది. ఇలా ప్రతి సీజన్‌లో ముఖ్యంగా వేసవి, వర్షాకాలాల్లో విద్యుత్‌లైన్లు మరమ్మతులకు గురవుతుండడంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగక హైటల్టేజీ వస్తుండడంతో ఇళ్లల్లో గృహోపకరణాలు ధ్వంసమవుతున్నాయి. చాలా సందర్భాల్లో టీవీలు, ఫ్యాన్లు, ఇతర పరికరాలు కాలిపోయిన సందర్భాలున్నాయి. పొలాల గుండా 33 కేవీ విద్యుత్ లైన్ ఉండడంతో ఈ లైన్ బ్రేక్‌డౌన్ అయ్యేటప్పుడు సమస్యను గుర్తించలేక గంటల కొద్దీ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది.



వీరఘట్టం 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

కొత్త విద్యుత్ లైన్ వేయాలి....

వీరఘట్టం మండల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలంటే ప్రధాన రహదారి గుండా కొత్త విద్యుత్ లైన్ వేస్తే గాని ఈ సమస్యను పరిష్కరించలేమని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. పాలకొండ నుంచి వీరఘట్టానికి 20 కిలోమీటర్ల దూరం. నిబంధనల ప్రకారం ప్రతి కిలోమీటర్‌కు 20 నుంచి 25 స్తంభాలు వేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన పాలకొండ - వీరఘట్టం కొత్త విద్యుత్ లైన్‌కు సుమారు 400 నుండి 500 వరకు విద్యుత్ స్తంభాలు అవసరమవుతాయి. అలాగే ఇన్సులేటర్లు, ఏబీ స్విచ్‌లు, వైరు ఇలా కొత్తవి వేసేందుకు సుమారు రూ.3 కోట్లు వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం..

పాలకొండ - వీరఘట్టం 33 కేవీ ప్రధాన విద్యుత్ లైన్‌ను ఆధునీకరించాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గాలి, వాన వచ్చేటప్పుడు బ్రేక్ డౌన్ అవుతోంది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా ఈ లైన్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. అందుకు ప్రతిపాదనలు కూడా పంపించాం. కొత్త విద్యుత్ లైన్ ఏర్పడితే నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించగలుగుతాం.

–డి.బాలాజీ, ట్రాన్స్‌కో ఏఈ, వీరఘట్టం

ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. ఫిట్ ఫర్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యమైన జీవన శైలి ప్రోత్సహించడానికి కళాశాల ఆవరణలో శనివారం ఇష్టాగోష్టి చేపట్టారు. జాతీయ క్రీడా వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వ్యాయామ విద్యా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భాసర్కరరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు ఎస్.జైరామన్, మోహన్‌లాల్, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, బి.రాజు, ఎస్.సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో నిర్వహిస్తున్న ఇష్టాగోష్టిలో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ శ్యాంబాబు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కుక్కిడి గ్రామ సచివాలయ కార్యదర్శి అడ్డాకుల జాహ్నవి కోరారు. పీఎం జన్‌మన్(జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతమానుగూడ పీవీటీజీ గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలోని గిరిజన ప్రజలు, గ్రామీణుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో వీపీఏ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది

స్థల పరిశీలన

పాలకొండ: నగర పంచాయతీకి సంబంధించి డంపింగ్‌యార్డు సమస్య ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు. అధికారులు సమస్య పరిష్కారానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. స్థలం ఎక్కడ గుర్తించినా అక్కడి ప్రజలతో ఇబ్బందులేర్పడుతున్నాయి. తాజాగా మండలంలో ని సింగన్నవలస గ్రామ పంచాయతీ పరిధిలో రెండెకరాల ప్రభుత్వ స్థలం గుర్తించిన అధికారులు అందులో డంపింగ్ యార్డు నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిని అక్కడి స్థానికులు అడ్డుకోవడంతో శనివారం మరోమారు స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ బాలమురళీకృష్ణ, కమిషనర్ సర్వేశ్వరరావు, ఎస్సై ప్రయోగమూర్తి, సర్వేయర్ వెంకటరావులతో కూడిన బృందం స్థలాన్ని పరిశీలించింది. సింగన్నవలస పంచాయతీ నుంచి తీర్మానం తీసుకోవాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ కమిషనర్‌కు సూచించారు.



స్థలం పరిశీలిస్తున్న అధికారులు

సత్కారం

భామిని: మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఆర్. ఉమామహేశ్వరరావు శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో సహచర సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, రమేష్‌కుమార్ మాట్లాడుతూ, ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజేశ్వరరావు, మండల ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్ఓలు, వీఆర్ఏలు, డీలర్లు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో వైనతేయ పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ ఆవరణలోని శ్రీప్రసన్నాంజనేయస్వామికి వైనతేయ పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామి వారికి 15 వేల తమలపాకులు, 550 నిమ్మకాయలు, సింధూరం, పంచామృతాభిషేకాలతో ఆరాధించారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో ప్రసాదరావుశర్మ ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పాలకొండ, గంగంపేట, మందస, గుణుపూర్ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్...

- ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అనిల్‌కుమార్

సాలూరు: బ్యాంకు ఖాతా దారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. సాలూరులో ఆయన శనివారం మాట్లాడుతూ బ్యాంకు పరిధిలోని ఖాతాల్లో ఇటీవల సైబర్ నేరాల సంఖ్య పెరిగిందన్నారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి సెల్‌ఫోన్లకు వచ్చే లింకులు, మేసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 48 గంటల్లోగా 1930 నంబరుకు డయల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల తమ వంతు బాధ్యతగా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులంతా సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ ఎస్ఐ దినకర్ అన్నారు. మండలంలోని కవిటిభద్ర కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సెల్‌ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కొమరాడ: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని కుమ్మరిగుంట గ్రామాన్ని శనివారం సందర్శించిన ఆయన.. అక్కడి గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. అనంతరం అక్కడ నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో అనారోగ్యం బారినపడి బాధపడుతున్న వారి వివరాలు సేకరించి, వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడపడితే అక్కడ ఉండే మురుగు, వర్షపునీటి నిల్వల్లో విపరీతంగా దోమలు పెరిగి తద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి సీజనల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. అలాగే కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా బారినపడే అవకాశం ఉందన్నారు. ప్రతీ గ్రామంలో ప్రజల ఆరోగ్య స్థితిగతులను సిబ్బంది తెలుసుకోవాలని, జ్వరపీడితులు, రక్తహీనతతో బాధపడే వారి ఆరోగ్యం మెరుగుపై నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. అక్కడి నుంచి ఆర్ఎల్ పురం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లి, రక్తహీనతతో బాధపడే గర్భిణుల వివరాల జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడెమిక్ సెల్ ఈవో సత్తిబాబు, వైద్య సిబ్బంది వాణి, శారద, అప్పలనాయుడు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరిగుంటలో వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు

'పరిసరాల పరిశుభ్రత'

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం శనివారం నిర్వహించారు. సర్పంచ్ బి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, వర్తక, వైశ్య సంఘాల నాయకులు కలిసి అక్కడి చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా విపరీతంగా పెరిగిన జంగిల్స్‌ను తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ కెమరాలు ఏర్పాటు చేసి, ఎవరు కావాలని చెత్త వేస్తున్నారో నిఘా ఉంచడం జరుగుతుందన్నారు.



పాఠశాల ఆవరణ ముందు పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

సారాబట్టీలపై పోలీసుల దాడులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కాపుగూడ గ్రామ పరిసరాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సారాబట్టీలపై ఎల్విన్‌పేట పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 800 లీటర్ల బెల్లం ఊట కనుగొని, ధ్వంసం చేయడంతో పాటు భారీగా సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసినా అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.శివప్రసాద్ హెచ్చరించారు. ఎక్కడైనా సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



సారాబట్టీ వద్ద సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కృష్ణం వందే జగద్గురుం..

పాలకొండ రూరల్ : కృష్ణం వందే జగద్గురుం అనే నామస్మరణతో పాలకొండ పురవీధులు మార్మోగాయి. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక నాగవంశపు వీధి కూడలి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మంటపంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో శనివారం తిరువీధి నిర్వహించారు. ఎస్సై కె.ప్రయోగమూర్తి, సేవా సమితి అధ్యక్షుడు సంతోష్‌కుమార్, తదితరులు పల్లకీ మోశారు.



శ్రీకృష్ణుని తిరువీధిలో పాల్గొన్న ఎస్సై, పట్టణ ప్రజలు, సేవాసమితి సభ్యులు

జీవామృతంతో బహుళ ప్రయోజనాలు

పాలకొండ రూరల్: రసాయన ఎరువులతో పోల్చుకుంటే జీవామృతంతో రైతులకు బహుళ ప్రయోజనాలుంటాయని డోలమడ వ్యవసాయ సహాయకుడు కనపాక అదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని వంతవాడ కాలనీలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించి, జీవామృతం తయారీని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహజసిద్ధంగా లభించే వస్తువులతో సేంద్రియ ఎరువు తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎస్.సత్యనారాయణ, ఎం.లక్ష్మణ్‌నాయడు, తదితరులు పాల్గొన్నారు.



జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సజావుగా ఎస్ఎంసీ ఎన్నిక

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నిక శనివారం సజావుగా జరిగింది. చైర్మన్‌గా రేవళ్ల సాయిరాం, వైస్ చైర్మన్‌గా మజ్జి కరుణలు ఎంపికయ్యారని, మరో 15 మంది సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. ఇదే పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక కోరం లేని కారణంగా రెండు సార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ప్రశాంత వాతావరణంలో ఈ ఎన్నిక జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఎన్నికలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బందిని బందోబస్తుగా ఎస్ఐ అవినాష్ పంపించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎంసీ సభ్యులతో ఎంఈవో శ్రీనివాసరావు

కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తం

సాలూరు: తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. తహసీల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పట్టణం, మండలంలో ప్రమాదకర, పొంగిపొర్లే వాగులు, నదులు, వంతెనలు తదితర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, అత్యవసర సమయంలో తప్పితే ప్రజలు బయటకు రావొద్దని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



శివరాంపురం వంతెన వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

ప్రకృతి రమణీయం..



మల్లమ్మగూడ ప్రాంతానికి వెళ్లే రహదారి



అలరిస్తున్న కొండలపై మేఘాలు

ఏజెన్సీ ప్రాంతంలో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పాటు మేఘాలు దట్టంగా కమ్ముకోవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. పచ్చని వాతావరణంతో పాటు కొండకోనలు చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పాలకొండ నుంచి సీతంపేట వెళ్లే రహదారిలో కొండలపై మేఘాలు తెలుపు, నీలం రంగుల్లో అలరిస్తున్నాయి. ఆ రోడ్డుమీదుగా శనివారం రాకపోకలు సాగించే ప్రయాణికులు, పర్యాటకులు ఈ సుందర దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించారు. – పాలకొండ